APTEL/2009/29308
స్నేహిత
# ఎక్స్‌ప్రెస్
నిజం దాగదు.. వార్త ఆగదు
తెలుగు దినపత్రిక
02-05-2026
శనివారం
హైదరాబాద్
సంపుటి: 17 I సంచిక: 187
పేజీలు: 04 I వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్
FOLLOW:
https://epaper.expresstelugudaily.com


2

## శంషాబాద్ వద్ద ఓఆర్ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

ఆర్టీసీ మనుగడ, గౌరవాన్ని పెంపొందించి ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు రావాలని కార్మిక సంఘాల ప్రతినిధులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. గుర్తింపు సంఘం ఎన్నికలు, విలీనంపై అన్ని సంఘాల నాయకులు సమావేశమై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు. పీఆర్సీ అంశాన్ని తాము పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.



- గాజులరామారంలో 100, బహదూర్‌గూడలో 150 ఎకరాల్లో బస్ టెర్మినళ్లు
- ఒక డ్రైవర్‌ను ఉద్యోగం నుంచి తొలగించం
- ఉద్యోగులు, మేనేజ్‌మెంట్ మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉండాలి
- ఆర్టీసీ కార్మిక సంఘాల ప్రతినిధులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
- సమ్మె కాలంలో వేతనాల చెల్లింపు, కేసుల ఎత్తివేతకు ఆదేశం

# సమగ్ర కార్యాచరణతో రండి

## ఆర్టీసీ గుర్తింపు ఎన్నికలు... విలీనంపై సీఎం సూచన

### పీఆర్సీ అంశాన్ని మేం పరిష్కరిస్తాం

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ఆర్టీసీ మనుగడ, గౌరవాన్ని పెంపొందించి ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు రావాలని కార్మిక సంఘాల ప్రతినిధులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. గుర్తింపు సంఘం ఎన్నికలు, విలీనంపై అన్ని సంఘాల నాయకులు సమావేశమై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు. పీఆర్సీ అంశాన్ని తాము పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర ఉన్నతాధికారులతో ఆర్టీసీ కార్మిక సంఘాల ప్రతినిధులు ముఖ్యమంత్రి నివాసంలో శుక్రవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గుర్తింపు సంఘం ఎన్నికలు, విలీనంపై ఏవిధంగా ముందుకు పోవాలనే దానిపై సంఘాల నాయకులు సమావేశమై ప్రభుత్వం ఎదుట ఆప్షన్లు ఉంచాలని సూచించారు. ఒకవేళ యూనియన్ల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోతే ఏ యూనియన్‌కు ఆ యూనియన్ తమ ఆప్షన్లు ఇస్తే కామన్‌గా ఉన్న వాటికి ఆమోదం తెలిపి.. భిన్నాభిప్రాయాలు ఉన్న వాటిపై చర్చిద్దామని సీఎం అన్నారు. ఆర్టీసీ బకాయిలు తమ హయాంలోని కావని.. కానీ వాటిని చెల్లించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం ఆర్టీసీ..

మిగతా 2లో...



## సిలిండర్ల ధరలు పెరుగుతాయని

# ముందే చెప్పాను

- ఈ పెంపును నేను ముందే ఊహించా
- ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు ధరలు రూ. 1,380 పెరిగాయి
- కేవలం మూడు నెలల్లోనే 81శాతం పెరిగింది
- కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

**నేషనల్ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ల ధరల పెంపు నేపథ్యంలో కేంద్రంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. ఈ పెంపును తాను ముందే ఊహించానని అన్నారు. ఎన్నికల తర్వాత దేశీయ ద్రవ్యోల్బణ ఒత్తిళ్లకు గురయ్యే అవకాశం ఉందని ఆరోపించారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు ధరలు రూ. 1,380 పెరిగాయని, ఇది కేవలం మూడు నెలల్లోనే 81శాతం పెరిగిందని పేర్కొన్నారు. ఈ ధరల పెంపు ప్రభావం టీ స్టాల్స్, దాబాలు, హోటళ్లు, బేకరీలు, స్వీట్ షాపుల వంటి చిన్న వ్యాపారాలపై పడుతుందని అన్నారు. అలాగే గృహ ఖర్చులు కూడా ప్రభావితం అవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇది ఎన్నికల బిల్లు అంటూ కేంద్రంపై విమర్శలు గుప్పించిన ఆయన, గ్యాస్ తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని రాహుల్ గాంధీ హెచ్చరించారు. కాగా, త్వరలోనే పెట్రోలియం ఉత్పత్తుల ధరలను పెరుగుతాయని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మంగళవారం అన్నారు. బంగాల్‌లో పోలింగ్ బుధవారంతో ముగుస్తుండటం, అస్సోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడులో ఇప్పటికే పోలింగ్ పూర్తయిపోవడంతో మోదీ ప్రభుత్వం త్వరలోనే



పెట్రోలియం ఉత్పత్తుల ధరలను పెంచుతుందన్నారు. ప్రజలు పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని చెప్పారు. "ఎన్నికల ఉపశమనం ముగిసింది. ద్రవ్యోల్బణ తాపం వచ్చేస్తోంది! ఏప్రిల్ 29 తర్వాత జాగ్రత్త పెట్రోల్, డీజిల్, అన్నీ ఖరీదవుతాయి. చమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు, మోదీ ప్రభుత్వం లాభాలను తన జేబులో వేసుకుంది. ఇప్పుడు ధరలు పెరిగాయి కాబట్టి, ఆ భారాన్ని మీపై మోపుతుంది. ధరలు తక్కువగా ఉన్నప్పుడు దోచుకునే ప్రభుత్వం, ద్రవ్యోల్బణ తీవ్రతను మాత్రం ప్రజలే భరించేలా వదిలేస్తుంది." అని రాహుల్ గాంధీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.


2

## హామీలు అమలు చేయకుంటే

# ఆందోళన చేస్తాం

- రైతులకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- ధాన్యం, మొక్కజొన్న, శనగ కొనుగోలులో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది
- తాలు, తరుగు, తేమ లేకుండా వడ్లు కొంటానన్న హామీని సమాధి చేశారు
- కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

## రాష్ట్రంలో శాంతి భద్రతల కోసం

# అహర్నిశలు కృషి చేస్తా

- ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరేలా కృషి చేస్తా
- నేరాల దర్యాప్తులో తెలంగాణ పోలీసులు ఇప్పటికే ఉత్తమ పనితీరు కనబరిచారు
- ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ చివరి దశకు చేరుకుంది: సీవీ ఆనంద్
- తెలంగాణ నూతన డీజీపీగా సీవీ ఆనంద్ బాధ్యతలు

2






## ఎన్నికల తర్వాత గ్యాస్ ధర పెంపు

# ప్రజలను మోసగించడమే

- పెంచిన ధరలతో 19 కేజీల గ్యాస్ ధర మూడువేలకు మించి పోయింది
- ఈ పెంపుతో సామాన్యుల జీవన ప్రమాణాలపై కోలుకోలేని దెబ్బ
- కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ధరల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2



## జూన్ 2 నాటికి జర్నలిస్టుల

# ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం

- జర్నలిస్టులు అందరూ ఒకేతాటిపై ఉంటే సమస్యల పరిష్కారం సులువు అవుతుంది
- అన్ని సొసైటీలు కలిపి ఒకే వేదికపైకి వచ్చి జేఏసీ ఏర్పాటు చేసుకోవాలి
- అనుమానాలకు తావు లేకుండా ఇళ్ల స్థలాల మంజూరు జరిగేలా అందరూ సహకరించాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2

విలేకరులు కావలెను
స్నేహిత ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
expresstelugudaily.com
Contacts
తెలంగాణ
95500 21491
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
ఎక్స్‌ప్రెస్ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మండల రిపోర్టర్లు, యాడ్స్ ఏజెంట్స్ వెంటనే కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు..

# సమగ్ర కార్యాచరణతో రండి

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగుల నిధులను వాడుకుందని సీఎం గుర్తు చేశారు. ఆర్టీసీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. సమస్యల శాశ్వత పరిష్కారానికి అంతా కలిసిరావాలని, భావోద్వేగాలు, రాజకీయాల ప్రభావాలకు లోనైతే సంస్థకు నష్టం వాటిల్లుతుందని సీఎం అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ప్రభుత్వం వేర్వేరనే భావన తమకెప్పుడూ లేదన్నారు. 2006లో జడ్పీటీసీ సభ్యునిగా గెలిచిన్పటి నుంచి ఎమ్మెల్యే, ఎంపీ, పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, అధ్యక్షునిగా ఉన్న సమయలో ఆర్టీసీ కార్మికులు చేసిన పోరాటాల్లో పాలుపంచుకున్నానని సీఎం గుర్తు చేశారు. సింగరేణి, విద్యుత్ కార్మికులతో పాటు ఆర్టీసీ కార్మికులు బలంగా కోరుకున్నందునే తాము అధికారంలోకి వచ్చామని సీఎం తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీలో నియామకాలు చేపట్టడంతో పాటు బస్సుల సంఖ్యను పెంచామని, కారుణ్య నియామకాలు చేప్టటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మహాలక్ష్మి పథకంతో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగిందని.. నెలా నెలా చెల్లింపులతో ఆర్టీసీ ఆదాయం పెరిగిందని సీఎం అన్నారు. పని భారం పెరిగినా క్షేత్ర స్థాయి సిబ్బంది సహనంతో పని చేస్తుండడంతో తెలంగాణ ఆర్టీసీ దేశంలోనే అగ్రగామి సంస్థగా నిలిచిందని సీఎం పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలు, దూర ప్రాంత ప్రయాణికుల సౌకర్యం కోసం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో బస్ టెర్మినళ్లు నిర్మించడానికి ఆర్టీసీకి గాజులరామారంలో వంద ఎకరాలు కేటాయించామని, బహదూర్‌గూడ (శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో)లో 150 ఎకరాలు కేటాయిస్తామని సీఎం తెలిపారు. ఆర్టీసీని సమున్నత స్థానంలో నిలపాలనే లక్ష్యంతోనే ఈ టెర్మినళ్ల నిర్మించాలని నిర్ణయించామన్నారు. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల నుంచి డిమాండ్ లేకపోయినా



తామే స్వయంగా ఈ నిర్ణయం తీసుకున్నామని సీఎం తెలిపారు. ఆర్టీసీలో డీజిల్‌కు ఏటా రూ.2 వేల కోట్లు వ్యయం చేస్తున్నారని.. ఆ వ్యయం తగ్గింపునకే తాము ఈవీల వైపు మొగ్గుచూపుతున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. ఆదాయం పెరగాలంటే ఖర్చు తగ్గించుకోవాలని, దీనికి పక్కా ప్రణాళిక అవసరమని సీఎం అన్నారు. 1000 ఈవీ బస్సులు కొనుగోలు చేసి మెట్రో, ఎంఎంటీఎస్‌తో అనుసంధానం చేసి లాస్ట్ మైల్ కనెక్టివిటీకి కృషి చేస్తామని సీఎం తెలిపారు. అధిక వడ్డీలకు తెచ్చిన అప్పులను రీకన్‌స్ట్రక్షన్ చేయడానికి ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సంస్థను బలోపేతం చేసుకుని నిలబెట్టుకోవడానికి కార్మికులు సహకరించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఆర్టీసీలో ఒక్క డ్రైవర్‌ను తొలగించమని ముఖ్యమంత్రి తెలిపారు. ఆర్టీసీ కార్మికులు, మేనేజ్‌మెంట్ మధ్య గ్యాప్ రాకుండా చూసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. డిపో మేనేజర్లు, ఈడీ, ఎండీ స్థాయి అధికారులు తరచూ కార్మిక సంఘాల నాయకులతో సమావేశమై సుహృద్భావ వాతావరణంలో మాట్లాడుకుంటే సగం సమస్యలు పరిష్కారమవుతాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కార్మిక సంఘాల ప్రతినిధులతో మూడు నెలలకోసారి సమావేశం కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ నాగిరెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. అనేక ఇబ్బందులున్నా ఉద్యోగులు, కార్మికులు సమస్యల పరిష్కారానికి తాము పెద్దపీట వేస్తున్నామని సీఎం తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల చెల్లింపులను రూ.700 కోట్ల నుంచి రూ.1000 కోట్లకు పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఆర్టీసీ సమస్యలను 100 శాతం పరిష్కరిస్తామని.. కార్మికులకు అండగా ప్రభుత్వం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. చిన్న చిన్న స్పర్ధలతో సంస్థకు నష్టం వాటిల్లే పనులు చేయకూడదని.. సంస్థ మనుగడ సాగిస్తేనే అందరికీ మేలు జరుగుతుందని సీఎం అన్నారు. ఈ సందర్భంగా 3 రోజుల సమ్మె కాలానికి వేతనాలు ఇవ్వాలని, సమ్మె కాలంలో పెట్టిన కేసులు ఎత్తివేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మిక సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. కార్మిక సంఘాల ప్రతినిధుల విజ్ఞప్తికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. సమ్మె కాలంలో వేతనం, కేసుల ఎత్తివేతకు వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్, అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి, ఎమ్మెల్యే లు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కేఆర్ నాగరాజు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు ఏ.ఆర్. రెడ్డి, థామస్ రెడ్డి (తెలంగాణ మజ్దూర్ యూనియన్), అశ్వత్థామ రెడ్డి, శంకర్ (తెలంగాణ మజ్దూర్ యూనియన్ (రి)), వీరాంజనేయులు, వి.ఎస్.రావు (స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్), ఎస్.బాబు, ఈ.వెంకన్న (ఎంప్లాయీస్ యూనియన్), పి.కమల్ రెడ్డి, ఎండీ మౌలానా (నేషనల్ మజ్దూర్ యూనియన్), ఎంకే బోస్, బి.యాదగిరి (కార్మిక పరిషత్), జి.అబ్రహం, మొగుళ్ల రాజిరెడ్డి (స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్), రాజిరెడ్డి, బి.యాదయ్య (స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (రి)), బి.మునిరాములు, కె.యాదయ్య (బహుజన కార్మిక యూనియన్), కాచం సత్యనారాయణ, ఎండీ అక్బర్ అలీ (ఆర్టీసీ వర్కర్స్ యూనియన్), కె.మనోహర్‌రావు, ఈ.స్వామి కుమార్ (కార్మిక సంఘ్), పున్న హరికిషన్, గోవింద్ (సామాజిక తెలంగాణ మజ్దూర్ యూనియన్), డి.వి.కె.రావు, కె.హనుమంతు ముదిరాజ్ (తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్), దువ్వాసీ యాదయ్య, సుద్దాల సురేష్ (బహుజన్ వర్కర్స్ యూనియన్) తదితరులు పాల్గొన్నారు.





రాష్ట్ర భద్రతా వ్యవహారాల సలహాదారుగా నియమితులైన బి శివధర్ రెడ్డి , రాష్ట్ర నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే బదిలీపై వివిధ పదవీ బాధ్యతలు చేపట్టిన పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులు కూడా ముఖ్యమంత్రిని కలిశారు. ఎంసీహెచ్‌ఆర్డీలో ముఖ్యమంత్రిని కలిసిన అధికారుల్లో శిఖా గోయల్, డీఎస్ చౌహన్, షానవాజ్ ఖాసీం, శ్రీ తరుణ్ జోషి, బి సుమతి ఉన్నారు.

## హామీలు అమలు చేయకుంటే ఆందోళన చేస్తాం

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** కాంగ్రెస్‌ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యం చెందడంతో అన్నదాతలు అనేక ఇబ్బందులు పడుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌పేర్కొన్నారు. ధాన్యం, మొక్కజొన్న శనగ కొనుగోలులో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. ఈసందర్భంగా వివరిస్తూ రబీ సీజన్‌లో క్వింటాల్‌కు రూ. 500 బోనస్‌చెల్లించాలని తాలు, తరుగు, తేమ పేరు చెప్పి దోచుకుంటున్న దళారుల నుంచి రైతు ఆదుకుని ప్రతి గింజను మద్దతు దరకే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తాలు, తరుగు, తేమ లేకుండా వడ్లు కొంటానన్న హామీని సమాధి చేశారని, కళ్లముందే తేమ పేరుతో రైతులను నిలువునా ముంచుతున్నా ఎందుకు పట్టించుకోరని నిలదీశారు. మండుటెండల్లో కొనుగోలు కేంద్రాలవద్ద రైతులు పడుతున్న ఇబ్బందులు మీకు పట్టవా, వడ్లకు బోనస్ హామీ అంతా ఉత్తిదే అంటూ ఎద్దేవా చేశారు. గత రబీ సీజన్ కూ బోనస్ ఎగ్గొట్టి ఈ సీజన్ లోనూ బోనస్ కు పాతరేసినట్లేనా అంటూ ప్రశ్నించారు. పత్తి పంటకు మద్దతు ధర ఎగనామం పెట్టి రైతులను ముంచారని, మొక్కజొన్నకు కేంద్రం ఎమ్మెస్పీ ఇస్తున్నా కొనుగోలు బాధ్యతను విస్మరించి దళారులకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. అకాల వర్షాలతో రెండున్నరేళ్లలో 5 లక్షలకుపైగా ఎకరాల్లో పంట నష్టపోతే జరిగితే ఏం చర్యలు తీసుకున్నారని చెప్పాలని, ఎకరాకు రూ.10 వేల చొప్పున రూ.5 వేల కోట్లు చెల్లించాలని కానీ రూ.260 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. దళారులకు దోచిపెట్టి రైతులను రోడ్డున పడేయడమే కాంగ్రెస్‌విధానామా, పౌరసరఫరాల సంస్థను అప్పుల ఊబిలోకి నెట్టారని, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ రూ.56 వేల కోట్ల అప్పులతో దివాళా తీయించిందన్నారు. కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనలో సంస్థను రూ.లక్ష కోట్ల అప్పుల పాలు చేశారని, వరంగల్ డిక్లరేషన్ ను పాతిపెట్టి రాయపూర్ ఏఐసీసీ రైతు తీర్మానాలకు తిలోదకాలిచ్చారా అని పేర్కొన్నారు. రబీ సీజన్ లో రైతుల బాధలపై ఏనాడైనా సమీక్షించారా, వడగాల్పులతో జనం అల్లాడుతుంటే డిజాస్టర్ మంత్రి నిద్రపోతున్నారని నిలదీశారు.ఎన్నడూ లేనంతగా ఎండలు మండిపోతుంటే సమ్మర్ యాక్షన్ ప్లాన్ ఎందుకు చేయలేదన్నారు.కరప్షన్, కలెక్షన్, ల్యాండ్ సెటిల్ మెంట్లు తప్ప రైతుల కన్నీటి వెతలతో మీకు పనిలేదని, నమ్మి ఓటేసిన పాపానికి అన్నదాతలను నట్టేట ముంచుతారా అని విరుచుక పడ్డారు. రైతు వ్యతిరేక ప్రభుత్వంగా ముద్ర పడినా మీకు చలనం లేదని, తక్షణమే రైతులను ఆదుకోవాలని, అన్నదాతలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు.

## శంషాబాద్ వద్ద ఓఆర్‌ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** శంషాబాద్ వద్ద ఓఆర్‌ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకంది. ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ 16 వద్ద ఆగివున్న లారీని వెనక నుంచి కారు ఢీకొంది. ఈ ఘటనలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. లారీ వెనుక భాగంలో కారు ఇరుక్కుపోవడంతో.. మృతదేహాలు అందులోనే చిక్కుకుపోయాయి. ప్రమాదంలో మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఘటనాస్థలికి పోలీసులు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను అతికష్టం మీద వాహనం నుంచి వెలికి తీశారు. ప్రమాద సమయంలో కారులో ఏడుగురు ఉన్నారు. అతి వేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది.మృతులంతా సిరిసిల్లకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న వీరంతా యాదగిరిగుట్ట వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారు.

### కేటీఆర్ దిగ్భ్రాంతి..

రోడ్డు ప్రమాదంలో ఆరుగురు సిరిసిల్ల వాసులు మృతి చెందడం పట్ల మాజీ మంత్రి కేటీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సిరిసిల్ల బీఆర్ఎస్ నేత బొల్లి రామ్మోహన్ సోదరుడు బొల్లి రాజు కుటుంబ సభ్యులు ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆయన సంతాపం ప్రకటించారు.



## రాష్ట్రంలో శాంతి భద్రతల కోసం అహర్నిశలు కృషి చేస్తాం

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రాష్ట్రంలో శాంతి భద్రతల కోసం అహర్నిశలు కృషి చేస్తామని తెలంగాణ నూతన డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. కొత్త టెక్నాలజీని మరింతగా వాడుకుంటూ సమర్థంగా పని చేస్తామన్నారు. ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరేలా కృషి చేస్తామని చెప్పారు. నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. శాంతి భద్రతల్లో సమస్య రాకముందే అప్రమత్తంగా ఉండటం మంచిదని అన్నారు.నేరాల దర్యాప్తులో తెలంగాణ పోలీసులు ఇప్పటికే ఉత్తమ పనితీరు కనబరిచారని ఆయన తెలిపారు. మారుతున్న పరిస్థితుల్లానే నేరాలు జరిగే తీరులోనూ మార్పులు వస్తున్నాయన్నారు. నేరగాళ్లు కొత్త కొత్త టెక్నాలజీని వాడుతూ, మోసాలకు పాల్పడుతున్నారన్నారు. వారు అనుసరిస్తున్న టెక్నాలజీ పోలీసులకు కూడా సవాలు విసురుతుందని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ చివరి దశకు చేరుకుందని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఆ కేసును ప్రస్తుతం సిట్ విచారిస్తుందన్నారు. గతంలో హైదరాబాద్ సీపీగా ఉన్నప్పుడే ఆ కేసు గురించి తనకు తెలుసని ఆయన వివరించారు. త్వరలో ఫోన్ ట్యాపింగ్ కేసును సమీక్షించి తుది ఛార్జిషీట్ ఫైల్ చేస్తామని సీవీ ఆనంద్ తెలిపారు.అంతకు ముందు కుటుంబ సభ్యులతో కలిసి డీజీపీ కార్యాలయంలో సీవీ ఆనంద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం అందించారు. డీజీపీగా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సీవీ ఆనంద్‌కు పోలీసు శాఖ ఉన్నతాధికారులు శుభాకాంక్షలు తెలిపారు.



### కీలక విభాగాల్లో సేవలు..

1991 ఐపీఎస్ బ్యాచ్‌నకు చెందిన సీవీ ఆనంద్ హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పదవి నుంచి ఇటీవలే పదోన్నతి పొందారు. హెడ్ ఆఫ్ పోలీస్ ఫోర్స్‌గా (డీజీపీగా) ఇవాళ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన పోలీస్ శాఖలోని పలు కీలక విభాగాల్లో సేవలందించారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా రెండు విడతల్లో పనిచేశారు. ఇంతవరకు డీజీపీగా ఉన్న శివధర్ రెడ్డి పదవీకాలం గురువారంతో ముగియడంతో సీవీ ఆనంద్‌ను ప్రభుత్వం నూతన పోలీస్ బాస్‌గా నియమించింది.

ఇటీవలే యూపీఎస్సీ (యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) డీజీపీ పోస్టుకు అర్హులైన ఐపీఎస్ అధికారుల జాబితాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి పంపించిన విషయం తెలిసిందే. ఆ జాబితాలో సీవీ ఆనంద్‌తో పాటు 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్యమిశ్రా ఉన్నారు. ఈ ముగ్గురిలో అత్యంత సీనియర్ అయిన సీవీ ఆనంద్‌ను డీజీపీగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

### చిన్ననాటి నుంచే క్రమశిక్షణకు మారుపేరుగా..

నూతన డీజీపీగా నియమితులైన సీవీ ఆనంద్ రంగారెడ్డి జిల్లాలోని హయత్‌నగర్ సమీపంలోని కుంట్లూరు గ్రామంలో ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. ఆయన బాల్యం నుంచే ఎంతో క్రమశిక్షణగా పెరిగారు. తండ్రి దామోదర్ రెడ్డి ప్రభుత్వ అధికారి కావడంతో పరిపాలనపై చిన్ననాటి నుంచే అవగాహన ఏర్పడింది. ప్రముఖ స్కూళ్లలో ఒకటైన హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదువుకున్నారు. నిజాం కాలేజీలో డిగ్రీ, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ విద్యను పూర్తి చేశారు. అనంతరం 1991లో సివిల్స్ పరీక్ష రాసి ఐపీఎస్ అధికారిగా ఎంపికయ్యారు.

### పోలీసింగ్‌లో ఎన్నో మార్పులకు ఆద్యుడు..

సీవీ ఆనంద్ తన కెరీర్ ప్రారంభంలోనే 10 సంవత్సరాల పాటు వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్ లాంటి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించడం ఆయనలోని పోరాట పటిమను చాటింది. ప్రాణాలకు తెగించి మరీ కీలక ఆపరేషన్లను లీడ్ చేసినందుకు గాను ఆయనకు 2002లోనే ప్రెసిడెంట్ గ్యాలెంటరీ మెడల్ అందుకున్నారు. హైదరాబాద్ ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ విభాగాల్లో ఆయన ప్రవేశపెట్టిన పలు కీలక మార్పులు నేటికీ ఆదర్శంగా ఉన్నాయి.నగరంలోని రోడ్లపై ప్రమాదాలను తగ్గించేందుకు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలను పెంచి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకున్నారు. అందుబాటులో ఉన్న సాంకేతికతను వాడుకుంటూ ఈచలాన్, స్పీడ్ గన్ వ్యవస్థలను ప్రాచుర్యంలోకి తెచ్చారు. సైబరాబాద్ కమిషనర్‌గా పనిచేస్తున్న సమయంలో షీ టీమ్స్, షీ షటిల్స్ తదితర వినూత్న కార్యక్రమాలతో ఐటీ కారిడార్‌లో మహిళలకు భరోసానిచ్చారు. ఎండలో విధులు నిర్వహించే కానిస్టేబుళ్లకు సన్‌గ్లాసెస్ పంపిణీ చేయడమే కాకుండా అనేక కీలక సంస్కరణలకు ఆద్యుడిగా నిలిచారు.

## జూన్2 నాటికి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిజాయితీ, చిత్తశుద్ధితో ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే పలు సందర్భాలలో ఇచ్చిన హామీల మేరకు అందరి అభిప్రాయాలను సేకరించి వచ్చేనెల 2వ తేదీనాటికి ఒక కొలిక్కి తీసుకువస్తామని వెల్లడించారు. శుక్రవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్, జర్నలిస్ట్స్ హౌసింగ్, డెక్కన్ జర్నలిస్ట్స్ , తెలంగాణ హౌసింగ్ సొసైటీలతో మంత్రి సమావేశం నిర్వహించారు.హైదరాబాద్ కేంద్రంగా ఉన్న జర్నలిస్టు హౌసింగ్ సొసైటీలు ఎప్పుడు ఏర్పాటయ్యాయి, అందులో సభ్యుల సంఖ్య, సభ్యత్వానికి అర్హతలు, ఇతర అన్ని అంశాలపై మంత్రి సొసైటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ మినహా మిగిలిన మూడు సొసైటీలలో సుమారు 2,424 మంది అర్హులైన జర్నలిస్టులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జర్నలిస్టులు అందరూ ఒకేతాటిపై ఉంటే సమస్యల పరిష్కారం సులువు అవుతుందని, అన్ని సొసైటీలు కలిపి ఒకే వేదికపైకి వచ్చి జేఏసీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జర్నలిస్టు సంఘాలలో సభ్యులు కాని అర్హులైన జర్నలిస్టులకు కూడా ఇళ్ళ స్థలాలు ఇస్తామని చెబుతూ ఎలాంటి విమర్శలకు, అనుమానాలకు తావు లేకుండా ఇళ్ల స్థలాల మంజూరు జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. గతంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలదేనని, ఇప్పుడు కూడా ప్రజా ప్రభుత్వం వచ్చాక 18 ఏళ్లుగా పరిష్కారం కాని జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ఇళ్ల సమస్యను కొలిక్కి తీసుకువచ్చి రవీంద్ర భారతిలో జర్నలిస్టుల కుటుంబాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి భూమి అప్పగించినప్పటికీ న్యాయవివాదాల కారణంగా సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని గుర్తు చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకొని జూన్ 2వ తేదీ నాటికి కొలిక్కి తీసుకువస్తామని తెలిపారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూల దృక్పథంతో ఉన్నారని ఫ్యూచర్ సిటీలో ఎమ్మెల్యేలు, బ్యూరో క్రాట్స్‌తో పాటే హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వారికి సూచన ప్రాయంగా వెల్లడించి సొసైటీలో ఒక తీర్మానం చేసి ప్రభుత్వానికి అందజేయాలని సూచించారు. 18 సంవత్సరాల క్రితమే ఇంటి స్థలాల కోసం ప్రతిసభ్యుడు రెండు లక్షల రూపాయిల చొప్పున చెల్లించారని దీనిని దృష్టిలో పెట్టుకొని ఇళ్ల స్థలాల కేటాయింపులో తమ సొసైటీకి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా సభ్యులు మంత్రిని కోరారు.



బీసీ సంక్షేమం, అభివృద్ధి వ్యవహారాల రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన వి హనుమంతరావు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంసీహెచ్‌ఆర్డీలో జరిగిన సమావేశంలో ఎంపీలు వేం నరేందర్ రెడ్డి,అనిల్ కుమార్ యాదవ్ , పలువురు నేతలు పాల్గొన్నారు.

## ఎన్నికల తర్వాత గ్యాస్ ధర పెంపు ప్రజలను మోసగించడమే

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ ధర పెంచడంపై రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఇది సామాన్యుడిపై పెనుభారం మోపే నిర్ణయం అని ఆయన దుయ్యబట్టారు. 19 కేజీల గ్యాస్ ధరను 993 రూపాయలకు అంటే సుమారు 1000 రూపాయలకు పెంచడంపై శుక్రవారం రోజు ఆయన తీవ్రస్థాయిలో స్పందించారు. ఒక్కసారిగా 30 నుండి 35 శాతం పెంచడంతో హోటళ్లు, కేఫ్‌లు రెస్టారెంట్లతో సహా చిన్న తరహా వీధి వ్యాపారులపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ముగిసిన 24 గంటలు పూర్తి కాగానే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన ఎద్దేవా చేశారు. ముమ్మాటికీ ఇది ప్రజలను మోసం చేసేందుకే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని పశ్చిమ బెంగాల్ ఎన్నికలు పూర్తి కాంగానే కమర్షియల్ గ్యాస్ ధర పెంచడం అంటే సామాన్యులను మోసం చేయడమే నని ఆయన విమర్శించారు. కేంద్రం పెంచిన ధరలతో 19 కేజీల గ్యాస్ ధర మూడువేలకు మించి పోయిందన్నారు. కమర్షియల్ గ్యాస్ ధర పెంపుతో సామాన్యుల జీవన ప్రమాణాలపై కోలుకోలేని దెబ్బ పడుతుందని ఆయన చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ధరల పెంపు నిర్ణయాన్ని ఉప సంహారించుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

## మేము చేస్తున్న అభివృద్ధి పనులు చూసి

# బీఆర్ఎస్ నాయకులు ఉరివేసుకొని సావాలి



**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి చూసి, మేము చేస్తున్న అభివృద్ధి పనులు చూసి స్థానిక బీఆర్ఎస్ నాయకులు పెద్దేముల్ చౌరస్తాలో ఉన్న చెట్లకు ఉరివేసుకొని సావాలని వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు కే.శోభారాణి, మాజీ ఉపాధ్యక్షులు ఎన్.ఎల్లారెడ్డి, పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీణ్ కుమార్ గుప్తా, టీపీసీసీ రాష్ట్ర మైనారిటీ కన్వీనర్ ఎండి.రియాజ్,పెద్దేముల్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు డివై పెద్ద నర్సింహులు లు విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కే.శోభారాణి నివాసంలో ఇటీవల బీఆర్ఎస్ పార్టీ అభిర్భావ దినోత్సవ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కోహిర్ శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ.. విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి పలు విషయాలను వెల్లడించారు.ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు కే.శోభారాణి మాట్లాడుతూ..బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీని విమర్శించడం చాలా బాధాకరమని, కేసీఆర్ లాగా అబద్ధాల మాటలు, అబద్ధాల పనులు చేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ కాదని అన్నారు.బీఆర్ఎస్ పార్టీకి ఒక్క ఇల్లు ఇయ్యనికే చేతకాలేదని,కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రస్తుతం ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని ప్రతి ఒక్కటి చేసేది కేవలం కాంగ్రెస్ పార్టీయే అన్నారు.గత 10 ఏండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి కోట్పల్లి ప్రాజెక్టులో తట్టేడు మట్టి తీయడానికి చేతకాలేదని,కాంగ్రెస్ అభివృద్ధి చూసి ఓర్వలేక బురద జల్లడం సరికాదని,కోట్పల్లి ప్రాజెక్టుకు రూ.100 కోట్లు మంజూరు అయ్యాయని,దీంతో ప్రతి రైతు పొలానికి సాగు నీరు అందుతుందని అన్నారు. ఛాలెంజ్ చేసి అడుగుతున్న బీఆర్ఎస్ నాయకులు 10 ఎండ్లలో ఎన్ని రోడ్లు వేసింగ్రో? ప్రోసిడింగ్లను తీసుకొని పెద్దేముల్ బస్టాండ్ కు గానీ, తాండూరు చౌరస్తాకు గానీ రావాలని మేము ఎన్ని రోడ్లు వేశామో? చూయిస్తామని అన్నారు. మాకు చెప్పేంత గుండెలు బీఆర్ఎస్ నాయకులకు లేవని? 10

ఏండ్లు కేసీఆర్ ఎం చేశారని? మేము రైతులకు రుణమాఫీ చేశామని, మీకు ఏమి చేయడానికి చేతకాదని, కేవలం మాటలు చెప్పడం తప్ప చేసింది ఏమిలేదని, మేము,మా ప్రభుత్వం చేతలతో చేసి చూపే ప్రభుత్వమని అన్నారు.దళితబంధును గతంలో కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలకు మాత్రమే ఇచ్చుకొన్నారని, పెద్దేముల్ లో ఒక్కరికి కూడా దళితబంధు రాలేదని, తమ్మీ కోహిర్ శ్రీనివాస్ నువ్వు పార్టీ అధ్యక్షుడిగా ఉన్నావు కదా మరి అప్పుడు ఎందుకు అడగలేదు మరి అప్పుడు నువ్వు ఉరివేసుకొని ఉంటే మేము ఇప్పుడు ఉరివేసుకొనేవాళ్ళమని ఆరోపించారు.మేము ఉరివేసుకొనే పనులు చేయమని, మా అభివృద్ధి పనులు, మా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి చేస్తున్న పనులు చూసి మీరు ఉరివేసుకోవాలని సూచించారు.5 సంవత్సరాలలో ఏమి పనులు చేయాలో మాకు తెలుసని,మా ఎమ్మెల్యే నిధులు తెస్తారని, మేము అన్ని పనులు చేసి చూపిస్తామని అన్నారు.ఇప్పటివరకు కోటి రూపాయల రోడ్లు వేశామని, సర్పంచ్ గెలిచిన తరువాత ప్రైమరీ పాఠశాలకు రూ.10 లక్షలతో ప్రహరీగోడ, నూతనంగా అంగన్వాడీ భవనాలను మంజూరు చేశామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ బీదలను చూడమని చెప్పే పార్టీ అని, బీదలను వ్యత్యాసంగా చూడటం కాంగ్రెస్ రక్తంలోనే లేదని ఎద్దేవా చేశారు. కోహిర్ శ్రీనివాస్ తమ్మీ మీ చేనికి పోయే పానాది మేము వేసినామని నీకు ఆ విషయం తెలియదా? అని ప్రశ్నించారు. మాట్లాడేటప్పుడు బాగా ఆలోచన చేసుకొని మాట్లాడలని ఇక ముందుకూడా పనులు చేసేది, చేసింది మేమేనని, మాటాలు చాలా జాగ్రత్తగా మాట్లాడాలని హితవు పలికారు.జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ ఉపాధ్యక్షులు ఎన్.ఎల్లారెడ్డి మాట్లాడుతూ...గడిచిన 2 సంవత్సరాలలో పెద్దేముల్ మండల కేంద్రంలో రూ.4 కోట్ల 44 లక్షల రూపాయల పనులు చేయడం జరిగిందని, అందులో రూ.1 కోటి 20 లక్షల సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, సర్పంచ్ గెలిచిన తరువాత 2 నెలల్లో వివిధ అభివృద్ధి పనులకు రూ.20 లక్షలు, పెద్దేముల్ గ్రామ పంచాయతీలో పెండింగ్ లో ఉన్న నిధులను అన్నింటిని విడుదల చేయడం జరిగిందని అది కోహిర్ శ్రీనివాస్ కు కనిపీయడం లేదని ఆరోపించారు. పెద్దేముల్ గ్రామ పంచాయతీ పరిధిలో 61 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని, గతంలో కూడా బీసీ, ఎస్సీ కాలనీల్లో ఇండ్ల జాగాలను ఇచ్చింది, ఎస్సీ కాలనీలో హౌజ్ సైట్లను కూడా ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు.బీఆర్ఎస్ హాయాంలో ఏ ఒక్కరికి ఇండ్లు ఇవ్వలేదని, ఇండ్లకు సంబంధించిన సర్టిఫికేట్లను కూడా ఇచ్చిన దాఖలాలు లేవని ఆరోపించారు. పెద్దేముల్ గ్రామంలో 788 మంది లబ్దిదారుల గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 70 మందికి కల్యాణలక్ష్మీ చెక్కులు,481 మంది రైతులకు రూ.3 కోట్ల 93 లక్షల రుణమాఫీ చేశామని,రైతుభరోసాలో భాగంగా 2550 మంది రైతులకు 3070 ఎకరాలకు రైతుబంధు అందిందని అన్నారు. మహాలక్ష్మీ పథకంలో భాగంగా 500లకే గ్యాస్ సిలిండర్లు చాలా మందికి రావడం జరిగిందని, పాఠశాల విద్యార్థులకు ఉచితంగా మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పుస్తకాలు ఇవ్వడం జరిగిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం పేద వాళ్ళ కోసం అన్ని రకాలుగా అండగా ఉంటుందని అన్నారు. కేవలం కాంగ్రెస్ వాళ్ళకే లబ్ధిచేకూరేలా పథకాల అమలు ఉందని, కాంగ్రెస్ పార్టీ గ్రామకమిటీ అధ్యక్షుడు డివై పెద్ద నర్సింహులు, అతని కుమారునికి ఎస్సీ కార్పోరేషన్ లోన్లు ఒకే ఇంటిలో ఇద్దరికి వచ్చాయని,సంక్షేమ పథకాల విషయంలో పూర్తి వివరాలు తెలియకుండా అక్కడ కేవలం ఒక అప్లికేషన్ ను పట్టుకొని వచ్చి మంజూరు అయ్యాని చెప్పడం సరికాదని అన్నారు. ఒకవేళ మంజూరు అయ్యాయని నిరూపిస్తే మేము తప్పును ఒప్పుకోవడానికి సిద్ధంగా ఉన్నామని ఒక వేళ నిరూపించని పక్షంలో కోహిర్ శ్రీనివాస్ నువ్వు కూడా పెద్దేముల్ చౌరస్తాలోని అదే చెట్టుకు ఉరివేసుకుంటే ఇంకా బాగుంటుందని విమర్శించారు. పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీణ్ కుమార్ గుప్తా మాట్లాడుతూ..10 ఏండ్ల బీఆర్ఎస్ పాలనలో కోహిర్ శ్రీనివాస్ ఎవరికన్నా కొత్త రేషన్ కార్డు కానీ,కొత్త ఇల్లు కానీ, ఒక పెన్షన్ కానీ ఇప్పించిండా, ఆయన ఏమి పనులు చేశాడో పెద్దేముల్ చౌరస్తాకు వస్తే ఆయనతో మాట్లాడడానికి మేము సిద్ధంగా ఉన్నామని అన్నారు. ప్రస్తుతం ఎన్నో సంవత్సరాల కిందా కట్టిన కోట్ పల్లి ప్రాజెక్టు మరమ్మత్తుల కోసం తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి రూ.100 కోట్లు మంజూరు చేయించి ప్రాజెక్టును సస్యశామలంగా తీర్చిదిద్దుతుంటే దానికి మీరు ప్రోత్సహించాల్సింది పోయి విమర్శించి స్థాయిమీది కాదని అన్నారు.సీఎం రేవంత్ రెడ్డిని కూడా తెలుసుకోవాలని మాట్లాడుతున్నారు. అది కూడా సమంజసం కాదని అన్నారు.గ్రామ కమిటీ అధ్యక్షుడు డివై పెద్ద నర్సింహులుకు రెండు ఎస్సీ కార్పోరేషన్ లోన్లు మంజూరు అయ్యాయని కోహిర్ శ్రీనివాస్ నువ్వు అన్నావు కదా ,ఒకవేళ ఆయనకు రెండు లోన్లు మంజూరైతే ఆయన

ముక్కును పెద్దేముల్ చౌరస్తాలో నేలకు రాపిస్తాను, ఒకవేళ కాకపోతే నువ్వు ముక్కును నేలకు రాస్తావా? లేకపోతే ఉరివేసుకొని సచ్చిపోతావా? నీ లాగా సంకనాకే పార్టీలు మారే అవసరం మాకు లేదు, ఎప్పటికీ మేము మారము మాకు అవసరం లేదు. స్కూల్ బిల్డింగ్ కూల్చి రూపాయి తీసుకోలేదు ఎవ్వరి దగ్గర, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేశాము,ఇప్పటివరకు మా దగ్గర ప్రోసిడింగ్లు లేవని, మీరు ఏవేవో ఊహించుకొంటున్నారు అవి కూల్చిఇవి కూల్చి పైసలు తీసుకొంటున్నారని, ఇప్పటివరకు మీరు ఒక్క రేషన్ కార్డు ఇచ్చిన దాఖలాలు లేవని ఆరోపించారు.

టీపీసీసీ రాష్ట్ర మైనారిటీ కన్వీనర్ ఎండి.రియాజ్ మాట్లాడుతూ..గత 10 ఏండ్ల బీఆర్ఎస్ పాలనలో చేయని అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలో చేస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని,కోట్ పల్లి ప్రాజెక్టుకు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి రూ.100 కోట్లు మంజూరు చేశారని ఇవ్వన్ని కూడా బీఆర్ఎస్ నాయకులకు కండ్లకు కనిపీయడం లేదని అన్నారు.రాబోయే రోజుల్లోకూడా తాండూరు ఎమ్మెల్యేగా మనోహర్ రెడ్డిగారే ఉంటారని, రోహిత్ రెడ్డి జైలుకు వెళ్ళారని కోహిర్ శ్రీనివాస్ డిప్రెషన్ లో అలా మాట్లాడుతున్నారని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీయే మళ్లీ గెలుస్తుందని అన్నారు.బీఆర్ఎస్ నాయకులు అబద్ధపు ప్రచారాలు చేయడం మానుకోవాలని కోరారు. పెద్దేముల్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు డివై పెద్ద నర్సింహులు మాట్లాడుతూ..ఎస్సీ కార్పోరేషన్లో నాకు రెండు లోన్లు వచ్చాయని బీఆర్ఎస్ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని , అందులో ప్రత్యేకంగా నాపేరు తీసుకొని చెప్పారని,అది రుజువు చేస్తే ఇకముందు కూడా రాజకీయానికి దూరంగ ఉంటానని శపథం చేశారు. గతంలో ట్రాక్టర్లు, బీసీ బంధు ఎంతమంది కాంగ్రెస్ నాయకులకు ఇచ్చారో అందరికీ తెలుసని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు కళ్ళబొల్లి మాటలు మాట్లాడొద్దు,అవి నమ్మేంత పిచ్చివాళ్లు ఎవ్వరు లేరని అన్నారు.కోహిర్ శ్రీనివాస్ నువ్వు నాపేరు తీసుకొని రెండు లోన్లు తీసుకొన్నారు అని చెప్పడం నీకు ఎంత అందం అనిపిస్తుందో! డివై పెద్ద నర్సింహులు ఎవ్వరి దగ్గరనన్న ఒక్క రూపాయి అన్న తిన్నట్లు నిరూపిస్తే నువ్వు ఏదంటే దానికి నేను సిద్ధమని అన్నారు. గతంలో కార్పోరేషన్ లోన్లు తీసుకొని అమ్ము కొని తిన్నది ఎవ్వరో జనాలకు తెలుసునని, మరొక్కసారి నాపేరు ఎక్కడైనా తీస్తే బాగోదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జితేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఎర్ర బాలప్ప, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు సయ్యద్ షబ్బీర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు బుజ్జమ్మ, నాయకులు మల్లేషం,ఏక్బాల్, రాంరెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

---

కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కార్మిక వ్యతిరేక

## నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి

కార్మికులకు సమాన పనికి సమాన వేతనం 26000 ఇవ్వాలి


సిఐటియు మండలం నాయకులు యస్,గణపతి



**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా నాగల్ గిద్ద మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా సిఐటియు జెండాను గ్రామ పంచాయితీ కార్మికుల అధ్వర్యంలో* జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది.ఈ సందర్భంగా సిఐటియు నాగల్ గిద్ద మండలం నాయకులు యస్, గణపతి వార్డ్ మెంబర్ రమేష్ మాట్లాడుతూ.. చికాగో నగరంలో కార్మికులు 8 గంటల పని దినం కోసం అక్కడున్న కార్మికులు ఐక్యంగా కలిసి కట్టుగా రోడ్డెక్కి శాంతియుతంగా పోరాటాలు నిర్వహిస్తుండగా అక్కడున్న ప్రభుత్వం జీర్ణించుకోలేక కార్మికుల పైన కాల్పులు జరిపి కార్మికులను అతి దారుణంగా కాల్చి చంపి రక్తం ఏరులై పడుతుండగా ఆ రక్తంలో తడిసిన చొక్కనే ఎర్ర జెండాగా మారిందన్నారు. ఆ రకంగా కార్మికులు సాధించుకున్న కొన్ని కార్మిక చట్టాలను సాధించుకున్న పరిస్థితి ఉందన్నారు.కార్మికులకు కనీస వేతనం 26 వేలు రూపాయలు ఇవ్వాలన్నారు. కానీకేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు అండగా ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకొస్తూ కార్మికుల నడ్డి విరుస్తున్న పరిస్థితి ఉందన్నారు.కాబట్టి కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో మే డే స్ఫూర్తితో కార్మికులను ఐక్యం చేసి కేంద్ర ప్రభుత్వం పైన పోరాటాలకు సిద్ధం అవుతాయన్నారు.ఈ కార్యక్రమంలో కార్మికులు పండ్లిక్ నాయకులు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

---



## జొన్నలకు మద్దతు ధర ఇవ్వాలి

**కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి**
**ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి ఘాటు విమర్శలు**

**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నియోజకవర్గంలోని రైతులు పండించిన జొన్న పంటను ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కల్హేర్ మండల కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.నియోజకవర్గంలో రైతులు జొన్నలు, కందులు, మొక్కజొన్న వంటి పంటలను విస్తృతంగా సాగు చేశారని, ముఖ్యంగా కల్హేర్ మండలంలో జొన్న పంట అధికంగా పండించారని తెలిపారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వం మద్దతు ధరకు జొన్నలను కొనుగోలు చేయడానికి వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించి, చివరి గింజ వరకు కొనుగోలు చేసినట్లు గుర్తుచేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పంటలను కొనుగోలు చేయడంలో విఫలమైందని విమర్శించారు.ఎన్నికల సమయంలో అన్ని పంటలను కొనుగోలు చేసి బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఆ హామీలను విస్మరించిందని ఆరోపించారు. కొన్ని గ్రామాల్లో రైతులు కొనుగోలు కేంద్రాల కోసం అడిగితే, వాటిని ఏర్పాటు చేయమని ఎమ్మెల్యేలు చెప్పడం బాధాకరమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి రైతుల వద్ద ఉన్న జొన్నలను కొనుగోలు చేయాలని, లేకపోతే రైతుల తరపున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. పంటలను ప్రభుత్వం కొనుగోలు చేసే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నరసింహారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రామ్ సింగ్,మాజీ కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్ వెంకట్ నాయక్, మాజీ సర్పంచ్ బాలయ్య,మాజీ ఉప సర్పంచ్లు సాయిలు, జయరాం,నాయకులు నారాయణ,నరసింహ గౌడ్,విటల్, లక్ష్మణ్ నాయక్,రవీందర్ రెడ్డి, మాణిక్ ప్రభు,పండరి,శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

---

## ఘనంగా మల్లికార్జున స్వామికి బోనాలు

**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

మండల పరిధిలోని గడి పెద్దాపూర్ గ్రామంలో వెలిసిన ప్రసిద్ధ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. జాతర ఉత్సవాలు పురస్కరించుకొని శుక్రవారం మల్లికార్జున స్వామికి బోనాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. సందర్భంగా వందలాదిమంది మహిళలు,భక్తులు గ్రామ పురవీధుల గుండా బోనాలతో మల్లికార్జున స్వామి ఆలయానికి చేరుకొని స్వామివారికి నైవేద్యం సమర్పించి బోనాల మొక్కులు తీర్చుకున్నారు. బోనాల ఊరేగింపులో డప్పు వాయిద్యాలు,శివసత్తుల పూనకాలు,పోతురాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్సవాలను తిలకించడానికి గ్రామస్తులే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



---



## ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం, మూడు లక్షల ఆస్తి నష్టం

**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండల పరిధిలోని సీతా నగర్ గ్రామంలో ప్రమాదవశాత్తు ఇల్లు దగ్గం కావడంతో మూడు లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. మండల పరిధిలో సీతానగర్ గ్రామానికి చెందిన నల్లచెరువు నాగయ్య ఇంటికి గురువారం రాత్రి అందాజ 10:30 సమయంలో మంటలు చెలరేగడంతో ఇంటిలోని విలువైన నగదు, గృహ పరికరాలు,వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి.ప్రమాదంలో మూడు లక్షల ఆస్తి నష్టం జరగడంతో, స్థానిక పోలీస్ స్టేషన్లో బాధితుడు నాగయ్య ఫిర్యాదు చేశారు.ఎస్ఐ శంకర్ సంఘటన స్థలానికి చేరుకొని అగ్ని ప్రమాదంపై విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.




## ఎస్ఎస్సీ ఫలితాల్లో నారాయణఖేడ్

**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. ఖేడ్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన సోబియా మహిన్ 579 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. దీంతో బాలిక తల్లిదండ్రులు కుటుంబీకులు, బంధుమిత్రులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. రాబోవు రోజుల్లో మరింత ఉన్నత విద్యాభ్యాసం చేసి మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యాభ్యాసం చేసి కార్పొరేట్ స్కూల్ స్థాయిలో మార్కులు తెచ్చుకోవడం గర్వకారణం అని కొనియాడారు.అదేవిధంగా నారాయణఖేడ్ మండలంలోని 17 ప్రభుత్వ విద్యాసంస్థలలో 97% ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి విశ్వనాథ్,ఎంఐఎస్ కోఆర్డినేటర్ విష్ణువర్ధన్ రెడ్డి,విద్యాశాఖ అధికారులు తెలిపారు.

స్నేహిత ఎక్స్‌ప్రెస్
02-05-2026
శనివారం
హైదరాబాద్
expresstelugudaily.com





## ఆడపిల్ల పెళ్లికి అండగా
# సర్పంచ్ గుజ్జరి కిష్టయ్య

**- కేసారం గ్రామంలో ఆదర్శ సేవ**

**మోమిన్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కేసారం గ్రామంలో ఆడపిల్లల సంక్షేమం కోసం సర్పంచ్ గుజ్జరి కిష్టయ్య చేపడుతున్న సేవలు గ్రామస్తుల ప్రశంసలు అందుకుంటున్నాయి. గ్రామానికి చెందిన గడ్డమీదీ శోభా-యేసయ్య దంపతుల కూతురు శ్రీలత పెళ్లి సందర్భంగా సర్పంచ్ గుజ్జరి కిష్టయ్య రూ.25,000 ఆర్థిక సహాయం అందించి తన పెద్ద మనసును చాటుకున్నారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ..ఆడపిల్లల పెళ్లిళ్లలో ఇలాంటి సహాయం అందించడం వల్ల పేద కుటుంబాలకు ఎంతో ఊరట కలుగుతుందని, సర్పంచ్ చేస్తున్న సేవలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధితో పాటు సామాజిక బాధ్యతలను కూడా సమానంగా నిర్వర్తిస్తున్న నాయకుడిగా కిష్టయ్య పేరు నిలుస్తుందని కొనియాడారు.సర్పంచ్ గుజ్జరి కిష్టయ్య మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని, ముఖ్యంగా ఆడపిల్లల పెళ్లిళ్లలో ఎవరూ ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో సహాయం అందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవలను కొనసాగిస్తానని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,వార్డు సభ్యులు,యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది.



## పారిశుద్ధ్య కార్మికుల కష్టానికి
# సమాజం రుణపడి ఉంటుంది

- **పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై చిన్న నర్సింహులు**
- **ఉప సర్పంచ్ డివై ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి లాలప్ప**

**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** గ్రామ స్వచ్ఛతలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై చిన్న నర్సింహులు, ఉప సర్పంచ్ డివై ప్రసాద్,పంచాయతీ కార్యదర్శి లాలప్పలు అన్నారు. శుక్రవారం మే డే దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను శాలువాలు,పూల మాలలతో ఘనంగా సన్మానించి వారు గ్రామ ప్రజలకు చేస్తున్న సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై చిన్న నర్సింహులు,ఉప సర్పంచ్ డివై ప్రసాద్,పంచాయతీ కార్యదర్శి లాలప్ప లు మాట్లాడుతూ..గ్రామాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర అభినందనీయమని,వారి కష్టానికి సమాజం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని అన్నారు.ప్రతి రోజు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే పనిలో వారు నిబద్ధతతో పనిచేస్తున్నారని కొనియాడారు.పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి పెద్దేముల్ గ్రామ పంచాయతీ కట్టుబడి ఉందని వారికి అవసరమైన సౌకర్యాలను అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు,తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సేవ నుంచి
# రాజకీయాల్లోకి అడుగులు

- **జడ్పీటిసి ఎన్నికల్లో పోటీకి సిద్ధం**
- **రక్తదాత ఓం ప్రకాష్**

**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:**



సామాజిక సేవలో విశేష కృషి చేసిన రక్తదాత ఓం ప్రకాష్ త్వరలో రాజకీయాల్లోకి ప్రవేశించనున్నట్లు ప్రకటించారు. రానున్న జడ్పీటిసి ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు.ఇప్పటివరకు 49 సార్లు రక్తదానం చేసిన ఆయన, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి స్వయంగా వెళ్లి సహాయం చేస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. హైదరాబాద్, బీదర్ వంటి పట్టణాల్లో కూడా అవసరమైన వారికి తన సొంత ఖర్చులతో చేరుకుని రక్తదానం చేసిన ఘటనలు అనేకం ఉన్నాయి.నాగలగిద్ద మండలం ఉట్పల్లి గ్రామానికి చెందిన ఓం ప్రకాష్, చిన్ననాటి నుంచే సేవామార్గాన్ని ఎంచుకున్నారు. "ప్రతి రక్తదానం ఒక ప్రాణాన్ని కాపాడుతుంది" అనే నమ్మకంతో రక్తదానాన్ని తన జీవిత ధర్మంగా మార్చుకున్నారు. యువతలో అవగాహన పెంచేందుకు పుట్టినరోజులు, ప్రత్యేక సందర్భాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ ప్రోత్సహిస్తున్నారు.

సమాజ సేవలో చేసిన కృషిని గుర్తిస్తూ గ్లోబల్ పీస్ యూనివర్సిటీ నుండి ఆయనకు డాక్టరేట్ అవార్డు లభించింది. ప్రస్తుతం ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ సంస్థ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

రాబోయే రోజుల్లో నాగలగిద్ద మండలంలో జడ్పీటిసి ఎన్నికల బరిలో నిలుస్తానని, ప్రజల మద్దతుతో విజయం సాధించి మరింత సేవ చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పెన్షన్ కట్ అయిందని బెంగతో వృద్ధురాలు మృతి

**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ రేషన్ బియ్యం తో కాలం వెళ్ళబోతున్న వృద్ధురాలికి అధికారులు పెన్షన్ కట్ చేయడంతో బెంగతో మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన అల్లాదుర్గంలో చోటుచేసుకుంది. కుటుంబీకుల, స్థానికుల కథనం ప్రకారం అల్లాదుర్గం గ్రామానికి చెందిన తుపాకుల సంగమ్మ (78 ) సంవత్సరాలు భర్త ఎప్పుడో మరణించాడు.ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ పై ఆధారపడి జీవిస్తుంది. ఎన్నో ఏండ్లుగా పెన్షన్ పొందుతున్న మూడు నెలలు సరిగా పెన్షన్ తీసుకోవడం లేదని సాకుతో అధికారులు లబ్ధిదారుల జాబితా నుండి తొలగించారు. కుమార్తె పటాన్చెరులో నివాసం ఉంటుండడంతో మృతురాలు అక్కడే ఉంటుంది. పెన్షన్ డబ్బుల కోసం గత మూడు నెలలుగా తిరుగుతున్న,




పెన్షన్ సిబ్బంది సరైన టైంలో డబ్బులు ఇవ్వక పోవడంతో ఆమె పెన్షన్ కట్ చేశారు. దీంతో మెదక్ జిల్లా సంబంధిత శాఖ కార్యాలయంలో పలుమార్లు వినతి పత్రం అందజేసిన, పెన్షన్ రావడంలేదని బెంగతో మృతురాలు మృతి చెందారని సంబంధిత అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణమని కుటుంబీకులు తెలిపారు.

# ఆధ్యాత్మిక చింతనతో మన జీవితం ప్రశాంతం

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి





**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

ఆధ్యాత్మిక చింతనతో మన జీవితం ప్రశాంతంగా ముందుకు సాగుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండల పరిధిలోని జనగాం గ్రామంలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వార్షికోత్సవ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి.ఈ ఉత్సవాలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి, పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జితేందర్ రెడ్డి, రుద్రారం మహిపాల్ రెడ్డి, మంబాపూర్ శ్రీనివాస్ రెడ్డిలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా జనగాం గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడు దొరోళ్ళ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ముఖ్య అతిథులు ప్రారంభించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..ప్రతి ఒక్కరు భక్తి మార్గాన్ని అనుసరించాలని,ఆధ్యాత్మిక చింతనతో మన జీవితం ప్రశాంతంగా ఉంటుందని,ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జనగాం గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు చెక్కల నర్సింహులు,బుల్ల శివకుమార్, కర్రె మల్లేషం, గ్రామ పెద్దలు ఎం.రాం రెడ్డి,బసి రెడ్డి, చంద్రశేఖర్,బ్రహ్మం,వడ్ల రాఘవేంద్రచారి,అనంత రెడ్డి, చెక్కల అనంతప్ప,కల్వ అనిల్ కుమార్,చాకలి నర్సింహులు,గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

